



జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

శుక్రవారం 01 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 333 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్






## పోలీసు సారథికి ఆత్మీయ వీడ్కోలు





సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 1, ప్రతినిధి: రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి గురువారం ఉద్యోగ విరమణ పొందగా, ఈ సందర్భంగా రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం వేదికగా నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమం ఘనంగా, ఆత్మీయతతో సాగింది. సుదీర్ఘ కాలం పాటు పోలీసు శాఖలో వివిధ హోదాల్లో సేవలందించి తనదైన ముద్ర వేసిన ఆయన నిష్క్రమణ సమయంలో సహచర అధికారులు, సిబ్బంది భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమ ప్రారంభంలో శివధర్ రెడ్డి తన బాధ్యతలను శాంతిభద్రతల డీజీపీ మహేష్ ఎం. భగవత్‌కు అప్పగించగా, నూతన డీజీపీగా సి.వి. ఆనంద్ బాధ్యతలు స్వీకరించే వరకు మహేష్ భగవత్ ఇన్చార్జ్ డీజీపీగా వ్యవహరించనున్నారు. అనంతరం వీడ్కోలు పలికేందుకు వచ్చిన ఐపీఎస్ అధికారులు, సిబ్బంది అందరినీ ఆత్మీయంగా పలకరిస్తూ, కరచాలనం చేస్తూ ముందుకు సాగిన ఆయన, పూలతో అలంకరించిన వాహనంపై నిలబడి అందరికీ అభివాదం చేశారు. పోలీసు సంప్రదాయం ప్రకారం ఐపీఎస్ అధికారులు తాళ్లతో వాహనాన్ని లాగుతుండగా, సిబ్బంది పూలు చల్లుతూ ప్రధాన ద్వారం వరకు సాగనంపారు. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు అందరూ తమ ప్రియతమ అధికారికి వీడ్కోలు పలుకుతుండగా ప్రాంగణం మొత్తం భావోద్వేగంతో నిండిపోయింది. టీజీసీఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, శాంతిభద్రతల డీజీపీ మహేష్ ఎం. భగవత్, టీఎస్ఎల్పీఆర్బీ చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు, ఎస్పీఎఫ్ డీజీ స్వాతి లక్రా, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ విజయకుమార్ తదితరులు పాల్గొని ఆయనకు సాదర వీడ్కోలు పలికారు. చివరగా ప్రధాన గేటు వద్దకు చేరుకున్న శివధర్ రెడ్డి అందరి అభినందనలు స్వీకరించి తన వాహనంలో బయలుదేరారు.



## సంక్షేమ సరఫరాల్లో అక్రమాలకు చెక్ – కార్మికుల శ్రేయస్సే లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 1, ప్రతినిధి: సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలకు అందించే దుస్తులు, పుస్తకాలు, నోట్‌బుక్స్ తదితర వస్తువుల సరఫరాలో అక్రమాలను అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. ఈ విధానం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన వస్తువులు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు సరఫరాదారుల కోసం కాకుండా లబ్ధిదారుల కోసం అన్న దృక్పథంతో పనిచేయాలని, జూన్ 15 నాటికి యూనిఫారంలు పాఠశాలలకు చేరేలా చూడాలని సూచించారు. సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మండల స్థాయిలో నోడల్ అధికారులను నియమించి, గ్రామ స్థాయిలో పాఠశాలలు, హాస్టళ్లకు సరఫరా జరిగేలా సమన్వయం చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని పేర్కొంటూ, విద్యార్థులకు అందించే వస్తువుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఇదే సందర్భంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మిక వర్గానికి శుభాకాంక్షలు తెలుపుతూ, వారి శ్రేయస్సు, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల కోసం రూ.5 లక్షల ప్రమాద బీమా అమలు చేసినట్లు, సంక్షేమ చర్యల ద్వారా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. సింగరేణి కార్మికులకు బోనస్ చెల్లింపు, కాంట్రాక్ట్ కార్మికులకు ప్రత్యేక ప్రయోజనాలు, గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం వంటి పలు చర్యలు చేపట్టినట్లు సీఎం వివరించారు.




## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం మంత్రి శ్రీధర్ బాబు


సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 1, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిర్దేశించిన లక్ష్యాల మేరకు వేగంగా ముందుకు సాగాలని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉన్నతాధికారులకు ఆదేశించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఏటా 3,500 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గురువారం హిమాయత్ నగర్‌లోని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని 13 శాసనసభ నియోజకవర్గాల ఇందిరమ్మ ఇళ్ల పనులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవిన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, లక్ష్మణకుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పోరేషన్ ఛైర్మన్లు, హౌసింగ్ కార్పోరేషన్ ఎండీ వి.పి గౌతమ్, కలెక్టర్లు, పలు విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించిన ఆయన, అటవీ భూములకు సంబంధించిన అంశాలను సంబంధిత శాఖలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఫారెస్ట్ క్లియరెన్సుల కారణంగా ఇళ్ల నిర్మాణం ఆలస్యమవ్వకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కలెక్టర్లు తమ విచక్షణాధికారాలను వినియోగించి ఫారెస్ట్ భూముల పరిహారం వంటి అంశాలను ప్రాధాన్యతగా పరిష్కరించాలని కోరారు. క్షేత్రస్థాయిలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం సమీక్షించాలని, నిబంధనల పేరుతో జాప్యం చేయకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. గృహ నిర్మాణాల లక్ష్యాలను చేరుకోలేని అధికారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని మంత్రి శ్రీధర్ బాబు హెచ్చరించారు.

## గురుకులాల ఘన విజయం – 99.12% ఫలితాలతో కార్పొరేట్‌కు సవాల్: మంత్రి లక్ష్మణ్ కుమార్




సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 1, ప్రతినిధి: రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థలు 2026 పదవ తరగతి ఫలితాల్లో 99.12 శాతం ఉత్తీర్ణత సాధించి చరిత్ర సృష్టించాయని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మొత్తం 17,071 మంది పరీక్షలకు హాజరుకాగా 16,921 మంది ఉత్తీర్ణులయ్యారని వెల్లడించారు. గురువారం డీఎస్ఎస్ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఇది కేవలం ఫలితం కాదని, వ్యవస్థాత్మక మార్పులు, నిరంతర పర్యవేక్షణ, ప్రభుత్వ సంకల్పం, వ్యూహాత్మక సంస్కరణల సమిష్టి ఫలితమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గురుకులాలను నూతన దిశగా తీసుకెళ్తున్నామని తెలిపారు. 235 సంస్థల్లో 163 పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించగా, 9 జిల్లాల్లో అన్ని గురుకులాలు శాతం వంద ఫలితాలు సాధించాయని వివరించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 88.22%, ప్రథమ సంవత్సరంలో 77.79% ఉత్తీర్ణత నమోదు కాగా, జేఈఈ మెయిన్స్‌లో 441 మంది అర్హత సాధించి 35 మంది 90 పర్సెంటైల్ పైగా మార్కులు సాధించారని చెప్పారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, ప్రత్యేక స్టడీ అవర్స్, డౌట్ క్లారిఫికేషన్ సెషన్లు, వీక్లీ–మంత్లీ పరీక్షలు, రివిజన్, ఫెయిల్యూర్ రిస్క్ ఉన్న విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ వంటి చర్యలే విజయ రహస్యమని తెలిపారు. డేటా ఆధారిత విధానం, మైక్రో ప్లానింగ్, పర్ఫార్మెన్స్ విశ్లేషణ, తక్షణ సవరణ చర్యల ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల అంకితభావం, 24 గంటలు అందుబాటులో ఉండి బోధన అందించడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ప్రశంసించారు. పోషకాహారం, మెస్ ఛార్జీల పెంపు, కాస్మోటిక్ ఛార్జీల ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెరిగి ఫలితాల్లో ప్రతిఫలించిందన్నారు. ఆధునిక హాస్టళ్లు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, ల్యాబ్స్, క్రీడా వసతులతో గురుకులాలను మోడల్ ఎడ్యుకేషన్ క్యాంపస్‌లుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పరిపాలనలో పారదర్శకతతో బిల్లులు సమయానికి క్లియర్ చేయడం, తల్లిదండ్రుల విశ్వాసం పెరగడం వల్ల ఈ ఏడాది అడ్మిషన్లు రికార్డు స్థాయిలో పెరిగాయని చెప్పారు. భవిష్యత్తులో గురుకులాలను దేశంలోనే ఉత్తమ విద్యా నమూనాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఎస్సీ వసతి గృహాల్లో 95.11% ఉత్తీర్ణత నమోదు కాగా, ములుగు జిల్లా 100% ఫలితాలు సాధించిందని తెలిపారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన రామావత్ మల్లేశ్వరి 581 మార్కులతో అగ్రస్థానంలో నిలిచిందని వెల్లడించారు. సమావేశంలో పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 18 నెలల బాలునికి విజయవంతమైన లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ – ఉస్మానియా వైద్యుల అరుదైన ఘనత



సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 1, ప్రతినిధి: ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వైద్యులు మరోసారి తమ నైపుణ్యాన్ని చాటుకుంటూ గ్లైకోజెన్ స్టోరేజ్ టైప్-3 అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న 18 నెలల చిన్నారికి విజయవంతంగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ ఇర్ఫాన్, సాజియా దంపతుల కుమారుడు అఫన్ తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా, పరీక్షల్లో రక్తంలో చక్కెర స్థాయిలు తక్కువగా ఉండటం, కాలేయం అసాధారణంగా విస్తరించడం వంటి లక్షణాలు గుర్తించారు. అనంతరం చిన్నారి గ్లైకోజెన్ స్టోరేజ్ వ్యాధితో బాధపడుతున్నట్లు నిర్ధారించిన వైద్యులు, పరిస్థితి విషమంగా మారడంతో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని నిర్ణయించారు. కేవలం 10 కిలోల బరువు ఉన్న చిన్నారికి తండ్రి నుంచి సేకరించిన 240 గ్రాముల లివర్ భాగాన్ని అమర్చుతూ డాక్టర్ మధుసూదన్ నేతృత్వంలోని సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ బృందం సుమారు 14 గంటల పాటు క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించింది. ప్రస్తుతం బాలుని ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.50 లక్షల వరకు ఖర్చయ్యే ఈ శస్త్రచికిత్సను రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వ సహకారంతో పూర్తిగా ఉచితంగా నిర్వహించినట్లు ఉస్మానియా సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్ వెల్లడించారు. దేశంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇలాంటి శస్త్రచికిత్సలు అత్యంత అరుదుగా జరుగుతాయని, ముఖ్యంగా గ్లైకోజెన్ స్టోరేజ్ వంటి అరుదైన వ్యాధులకు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించడం వైద్య రంగంలో మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ అరుదైన శస్త్రచికిత్స విజయవంతం చేసిన ఉస్మానియా వైద్య బృందాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అత్యుత్తమ వైద్య సేవలు అందుతున్నాయని కొనియాడారు.

## మే చివరికి 2 బిహెచ్‌కే ఇండ్ల కేటాయింపు పూర్తి భూముల పరిరక్షణలో రాజీ లేదు: మంత్రి పొంగులేటి




సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 1, ప్రతినిధి: రాష్ట్ర వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలు ఏ దశలో ఉన్నా మే నెల చివరి నాటికి లబ్ధిదారులను గుర్తించి కేటాయింపులు పూర్తి చేయాలని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. చివరి దశలో ఉన్న ఇండ్లను త్వరగా పూర్తి చేసి, మిగిలిన వాటికి ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఐదు లక్షల లోపు అదనపు నిధులు అందిస్తామని తెలిపారు. కాంట్రాక్టర్లు ముందుకు రాని పక్షంలో లబ్ధిదారులే నిర్మించుకునేలా నిర్ణయం తీసుకున్నామని, గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేస్తామని వెల్లడించారు. హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడిన ఆయన, అనర్హులను తొలగించి అర్హులకు ఇండ్లు కేటాయించాలని, 2 బిహెచ్‌కే కాలనీల్లో రూ.400 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఇండ్లు తీసుకుని నివసించని వారి కేటాయింపులు రద్దు చేసి, అవసరమైన వారికి మళ్లీ కేటాయించాలన్నారు. బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు పేదలకు గృహ స్వప్నం నెరవేర్చేలా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు జరుగుతోందని, పేదరికమే అర్హతగా పరిగణించి నిజమైన లబ్ధిదారులకు ఇండ్లు అందించాలన్నారు. లబ్ధిదారులకు 40 టన్నుల ఇసుక ఉచితంగా అందిస్తున్నప్పటికీ దుర్వినియోగం జరగకుండా కలెక్టర్లు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరాలకు దూరంగా నిర్మించిన కాలనీల్లో నివాసం లేకపోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని, సమీప ప్రాంతాల వారికి కేటాయించే విధంగా చర్యలు పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేస్తూ, ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, ఫారెస్ట్ భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం జాయింట్ సర్వేలు నిర్వహించాలని సూచించారు. భూ రికార్డుల్లో పారదర్శకత కోసం సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామని, కొత్త రెవెన్యూ విభాగాల ఏర్పాటు లేదని తెలిపారు. ఈ సందర్భంగా హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో నెలకొల్పిన 30 కేవీ సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్ విద్యుత్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించగా, దీని ద్వారా నెలకు సుమారు 4500 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అధికారులు తెలిపారు. సమావేశంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన నామ నాగేశ్వరరావు, లింగాల కమల్ రాజు



సందేశం టైమ్స్, ఖమ్మం జిల్లా, మే 1, ప్రతినిధి: ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు బొర్ర నరసింహరావు మేనకోడలు సునీత వివాహం వంశీతో మండలంలోని జమలాపురం గ్రామంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగింది. ఈ వివాహ వేడుకకు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శీలం కవిత, మహదేవపురం గ్రామ సర్పంచ్ వాసిరెడ్డి నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు, షెగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, కుడుముల మల్లిఖార్జున్ రెడ్డి, మొండితోక జయకర్, మోరంపూడి ప్రసాద్, మధిర మున్సిపల్ కౌన్సిలర్ యన్నం శెట్టి అప్పారావు, యన్నం శ్రీనివాస రెడ్డి, తిరుపతిరావు, నారాయణ రెడ్డి, యరమల కృష్ణారెడ్డి, అరిగె శ్రీనివాసరావు, హుస్సేన్, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, కొటారి రాఘవరావు, తోట శ్రీను, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# మత్త్యేపల్లిలో పౌర హక్కుల అవగాహన సదస్సు




సందేశం టైమ్స్, ఖమ్మం జిల్లా, మే 1, ప్రతినిధి: చింతకాని మండలంలోని మత్త్యేపల్లి గ్రామంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పౌర హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కె. ద్రౌపతి అధ్యక్షత వహిస్తూ, గ్రామ ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కల్పించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వసతి గృహ సంక్షేమ అధికారి కొత్త వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, సమాజంలో అందరూ సమానమనే భావనతో జీవించాలని సూచించారు. గ్రామాల్లో భేదాభిప్రాయాలు, కుల దూషణలు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. అలాగే సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఏకవీర, శివరామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ రావు, జీపీఓ మహేందర్, ఆరోగ్య శాఖ ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# మున్నేరు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి కలెక్టర్ దివాకర టి.ఎస్





సందేశం టైమ్స్, ఖమ్మం, మే 1, ప్రతినిధి: ఖమ్మం మున్నేరు నది పై చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత కాలంలో నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఖమ్మం కేంద్రంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్ మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం, కాల్వొడ్డు తీగల వంతెన పనులు, భూ నిర్వాసితుల కోసం ఏర్పాటు చేస్తున్న లేఔట్ అభివృద్ధి పనులను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిపుణుల కమిటీ రూపొందించిన డిజైన్‌ల ప్రకారం రిటైనింగ్ వాల్ నిర్మాణం పక్కాగా జరగాలని, ఎడమ-కుడి వైపుల నుంచి సమన్వయంతో పనులు పూర్తి చేసి ఎక్కడా గ్యాప్‌లు లేకుండా చూడాలని సూచించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని, భూ నిర్వాసితులకు ఇవ్వనున్న ప్రత్యామ్నాయ భూముల లేఔట్ అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు, అవసరమైన వసతులతో ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ఈ చర్యలతో భూముల విలువ పెరిగి పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి విస్తరిస్తుందని తెలిపారు. ఖమ్మం నగరంలో మున్నేరు పై నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జి, తీగల వంతెన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నిర్మాణ పనుల వల్ల ఎవరూ నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఆర్&బీ ఎస్ఈ యాకుబ్, ఇరిగేషన్ డీఈ రమేష్ రెడ్డి, మిషన్ భగీరథ అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సఖి సెంటర్లలో అత్యుత్తమ సేవలు – అంగన్వాడీల పనితీరు ఆదర్శం: వల్లేటి ప్రేమ్ చంద్





సందేశం టైమ్స్, మెదక్, మే 1, ప్రతినిధి: సఖి సెంటర్లలో బాధిత మహిళలకు అత్యుత్తమ సేవలు అందాలని, మెదక్ జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల పనితీరు ఆదర్శంగా ఉందని మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, నోడల్ అధికారి వల్లేటి ప్రేమ్ చంద్ పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ పరిధిలో నిర్వహిస్తున్న సఖి సెంటర్, రెడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సఖి సెంటర్‌లో రిజిస్టర్లు పరిశీలించి క్లిష్ట కేసులపై వివరాలు తెలుసుకున్నారు. మహిళలు పని చేసే ప్రదేశాల్లో ఎదురయ్యే సమస్యలు, లైంగిక వేధింపుల నిరోధక చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని, పోషణ్ అభియాన్ ద్వారా తల్లి–శిశువులకు సంపూర్ణ పోషకాహారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, సీడీపీఓలు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకరి జ్యువెలర్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం




సందేశం టైమ్స్, మెదక్ జిల్లా, మే 1, ప్రతినిధి: మండల కేంద్రమైన కౌడిపల్లిలో శ్రీకరి జ్యువెలర్స్ పాన్ బ్రోకర్స్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి స్థానిక ఏఎస్ఐ ఆండాలు చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గురువారం సంత సందర్భంగా సంతకు వచ్చిన ప్రజలకు చల్లని నీరు, మజ్జిగ అందించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ ఆండాలు మాట్లాడుతూ ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న సమయంలో ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గతంలో వేసవికాలంలో దాతలు ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించేవారని, ప్రస్తుతం త్రాగునీటిని కూడా వ్యాపారంగా మార్చుతున్న పరిస్థితుల్లో ఇలాంటి సేవలు ఎంతో అవసరమని అన్నారు. శ్రీకరి జ్యువెలర్స్ యజమాని నాగరాజు చారి చేసిన ఈ సేవను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్వో జహీర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజీవ్ రెడ్డి, పార్టీ నాయకులు పోల నవీన్ చంద్రం, వెంకట్ గౌడ్, ఓం విశ్వకర్మ, టీవీ ఛానల్ ఎండీ కొండోజు నరసింహ చారి, గ్రామ పెద్దలు పునరీకం గౌడ్, సత్యనారాయణ గౌడ్, జగన్, హరీష్, గుడ్డంల రాజశేఖర్, శ్రీకాంత్ గౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

సందేశం టైమ్స్, మెదక్, మే 1, ప్రతినిధి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ నియోజకవర్గంలోని టెక్మల్ మండలం నార్సింగ్ గ్రామంలోని తుల్జా భవాని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అల్లాదుర్గ మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మీ నరసమ్మ, నరసింహ దంపతుల కుమారుడు భాను ప్రకాష్ – వినయ వివాహ కార్యక్రమంలో మంత్రి పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట నియోజకవర్గ నాయకులు శేషారెడ్డి, నిమ్మ రమేష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అల్లాదుర్గం ప్రభుత్వ దవాఖానలో 'డోలారన' కార్యక్రమం ప్రారంభం



సందేశం టైమ్స్, మెదక్, మే 1, ప్రతినిధి: అల్లాదుర్గం ప్రభుత్వ దవాఖానలో పసిపిల్లల రక్షణ కోసం 'డోలారన' కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సౌమ్య సురేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా తమ పిల్లలను పోషించలేని పరిస్థితుల్లో ఉన్న వారు బయట వదిలేయకుండా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక తొట్టెలో (క్రేడిల్) ఉంచవచ్చని తెలిపారు. అలా ఉంచిన పసిపిల్లలను ఆసుపత్రి యాజమాన్యం బాధ్యతగా తీసుకుని వారికి అవసరమైన సంరక్షణ చర్యలు చేపడుతుందని, అనంతరం కోర్టు ఆధ్వర్యంలో చట్టపరంగా పిల్లలు లేని దంపతులకు దత్తత ఇస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సౌమ్య సురేష్ గౌడ్, ఆసుపత్రి వైద్యులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బాలల సంరక్షణలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమర్థ అమలు




సందేశం టైమ్స్, మెదక్, మే 1, ప్రతినిధి: బాలల సంరక్షణలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం జిల్లాలో సమర్థవంతంగా అమలవుతోందని మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, నోడల్ అధికారి వల్లేటి ప్రేమ్ చంద్ అన్నారు. ఈ సందర్భంగా మెదక్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన బాలల సంరక్షణ ఎగ్జిబిషన్‌ను జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవితో కలిసి పరిశీలించారు. బాలల హక్కులు, ఆరోగ్యం, విద్య, భద్రతపై అవగాహన కల్పించడంలో ఈ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. పిల్లలు ప్రతిరోజూ ఎగ్జిబిషన్‌ను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని, వారి అభివృద్ధికి అవసరమైన చర్యలపై అధికారులు మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంకను కలిసిన ఎన్‌పిఆర్‌డీ ఇండియా నాయకులు



సందేశం టైమ్స్, మెదక్, మే 1, ప్రతినిధి: హైదరాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ప్రియాంకను ఎన్‌పిఆర్‌డీ ఇండియా నాయకులు లక్డీకాపూల్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌పిఆర్‌డీ ఇండియా జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్, రాష్ట్ర అధ్యక్షుడు దైనంపల్లి మల్లికార్జున్, గ్రేటర్ అధ్యక్షుడు మంద భిక్షపతి యాదవ్, రాష్ట్ర నాయకుడు కాసా ప్రవీణ్, సీడీఎస్ డైరెక్టర్ ఎం. శ్రీకాంత్ రెడ్డి తదితరులతో కూడిన ప్రతినిధి బృందం జిల్లాలోని దివ్యాంగుల సమస్యలపై కలెక్టర్‌తో సుదీర్ఘంగా చర్చించింది. ముఖ్యంగా డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపులో నిరుపేద దివ్యాంగులకు 10 శాతం ప్రత్యేక కోటాను కచ్చితంగా అమలు చేయాలని, ఇళ్లు లేని దివ్యాంగులకు న్యాయం చేయాలని నాయకులు కోరారు. అలాగే దివ్యాంగుల హక్కుల చట్టంపై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.



## పోసానిపేటలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం  రైతులకు ఉపశమనం

సందేశం టైమ్స్, అందోల్, మే 1, ప్రతినిధి: అందోల్ మండలంలోని పోసానిపేట గ్రామంలో కోపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ జి. గోపాల్, బ్యాంక్ అధికారులు సంప్రదాయ పద్ధతిలో వడ్ల సంచులకు పూజలు నిర్వహించి కొనుగోలు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో సెంటర్ మెయింటెనెన్స్ బాధ్యతలు నిర్వహిస్తున్న చి. ప్రకాష్, వార్డ్ సభ్యుడు వి. వెంకటేశం, ఇంటేనుక విజయ్, పన్యాల లక్ష్మయ్య తదితరులు పాల్గొనగా, పెద్ద సంఖ్యలో రైతులు హాజరై కేంద్రం ప్రారంభాన్ని స్వాగతించారు. కొనుగోలు కేంద్రం ప్రారంభం కావడంతో రైతులు తమ పంటను సమీపంలోనే విక్రయించుకునే అవకాశం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం వడ్లను కొనుగోలు చేస్తామని, తూకం ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, చెల్లింపులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. తడిచిన లేదా నాణ్యతలేని ధాన్యం తీసుకురాకుండా ఎండబెట్టిన వడ్లనే తీసుకురావాలని, తూకం వేయించే సమయంలో రైతులు స్వయంగా పరిశీలించాలని సూచించారు. మధ్యవర్తుల సమస్యలు లేకుండా రైతులకు న్యాయం జరిగేలా ఈ కేంద్రం ఉపయోగపడుతుందని గ్రామ నాయకులు పేర్కొన్నారు.




## నల్లపోచమ్మ ఆలయంలో మహిళా భద్రతపై షీ టీమ్ అవగాహన కార్యక్రమం

సందేశం టైమ్స్, మనూర్, మే 1, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండలంలోని బోరంచ గ్రామంలోని శ్రీ నల్లపోచమ్మ దేవస్థానం ఆవరణలో మహిళా భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాలపై షీ టీమ్ ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా షీ టీమ్ ఎస్ఐ పూలభాయ్ మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులు, లింగ వివక్ష, బాలల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలు, ఫేక్ అకౌంట్లు, సోషల్ మీడియా దుర్వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, షీ టీమ్ నంబర్ 8712656772ను వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, షీ టీమ్ సిబ్బంది, దేవస్థానం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పాల్గొన్నారు.

## మన్నే పోచయ్య–నర్సమ్మ దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు




సందేశం టైమ్స్, అందోల్, మే 1, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలంలోని రాంసాన్‌పల్లి గ్రామానికి చెందిన సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి మన్నే పోచయ్య–నర్సమ్మ దంపతుల 18వ పెళ్లిరోజు సందర్భంగా సందేశం టైమ్స్ యాజమాన్య బృందం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా అందోల్ నియోజకవర్గ సందేశం టైమ్స్ ఇంచార్జ్ మల్లేశం గౌడ్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ టి. సంగమేశ్వర్ మాట్లాడుతూ ఈ దంపతులు ఇలాంటి సంతోషకర వేడుకలను మరెన్నో సంవత్సరాలు జరుపుకుంటూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.


## బాలల రక్షణపై భరోసా సెంటర్ అవగాహన కార్యక్రమాలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 1, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో "ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా భరోసా సెంటర్ ద్వారా బాలల రక్షణ, చైల్డ్ సేఫ్టీపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా కోర్ట్ సంగారెడ్డి, సిర్గాపూర్ గ్రామం, కడ్పల్ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా కంగ్టి సీఐ వెంకట్ రెడ్డి, భరోసా కోఆర్డినేటర్ దేవలక్ష్మి మాట్లాడుతూ లింగ సమానత్వం పాటించాల్సిన అవసరాన్ని, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తూ నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మౌనం వీడి ముందుకు వచ్చినప్పుడే న్యాయం సాధ్యమవుతుందని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, మహిళా హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, భరోసా సెంటర్ నంబర్ 8712656773ను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, పోలీసు సిబ్బంది, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.


## 62 మంది చిన్నారులకు సైకిళ్ల పంపిణీ చేసిన జగ్గారెడ్డి





సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 1, ప్రతినిధి: సంగారెడ్డి పట్టణంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న 62 మంది చిన్నారులకు కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఇప్పటికే తమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులకు విడతల వారీగా సైకిళ్లు అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులతో మాట్లాడిన జగ్గారెడ్డి, పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల కోసం ఈ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. మొత్తం 25 మంది బాలికలు, 37 మంది బాలురకు సైకిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చేర్యాల ఆంజనేయులు, జార్జ్ మాథ్యూస్, కూన సంతోష్, కిరణ్ గౌడ్, శ్రీకాంత్, మహేష్ ముదిరాజ్, రాజు, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## బోరంచ నల్లపోచమ్మ జాతరలో రెండో గురువారం ప్రత్యేక పూజలు ఘనంగా



సందేశం టైమ్స్, మనూర్, మే 1, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండలంలోని బోరంచ గ్రామ శివారులో మంజీర నది తీరాన వెలసిన ప్రసిద్ధ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ఏడు వారాల జాతర ఉత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగుతున్నాయి. రెండవ గురువారం సందర్భంగా ఆలయ అర్చకులు సిద్దు స్వామి, నాగేష్ స్వామి అమ్మవారికి పంచామృతాలు, గంగాజలంతో మహాభిషేకం నిర్వహించి కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం పసుపు–కుంకుమ తిలకం దిద్ది పట్టువస్త్రాలు సమర్పించి సుగంధ పుష్పాలతో అమ్మవారిని అలంకరించి హారతి ఇచ్చి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ జాతరలో రెండవ గురువారం ప్రత్యేక ప్రాధాన్యం కలిగినదని, కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారని తెలిపారు. జిల్లాలో ప్రాచుర్యం పొందిన శక్తి పీఠాలలో ఈ ఆలయం ఒకటిగా నిలిచిందని, మొక్కులు పెట్టిన భక్తుల కోరికలు నెరవేరుతాయనే నమ్మకంతో ప్రతి సంవత్సరం వేలాదిమంది అమ్మవారిని దర్శించుకుంటున్నారని పేర్కొన్నారు.

## చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావును సన్మానించిన మున్సిపల్ కౌన్సిలర్లు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 1, ప్రతినిధి: నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పర్యటన సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు బీ. రాజు ముదిరాజ్, మహేష్ చౌహాన్, గోపాల్ రెడ్డి, సుబూర్, షారుక్ ఖాన్, మాజీ ఎంపీటీసీ పండరెడ్డి, ముంతాజ్ తదితరులు పాల్గొని చీఫ్ సెక్రటరీకి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై స్థానిక నాయకులు చర్చించినట్లు సమాచారం.

## 35 ఏళ్ల సేవలకు ముగింపు.. సీనియర్ అసిస్టెంట్ దశరథ్‌కు ఘన వీడ్కోలు



సందేశం టైమ్స్, వట్పల్లి, మే 01: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దశరథ్ ఈరోజు పదవీ విరమణ పొందారు. జిన్నారం మండలంలో ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఆయన 35 సంవత్సరాల పాటు నిబద్ధతతో సేవలందించి మంచి పేరు సంపాదించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఎంపీడీవో రాంరెడ్డి, తహసీల్దార్, ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు మాట్లాడుతూ 'దశరథ్ విధి నిర్వహణలో కర్తవ్యనిష్ఠ, అంకితభావంతో పనిచేసిన ఆదర్శ ఉద్యోగి' అని కొనియాడారు. పదవి విరమణ పొందిన సీనియర్ అసిస్టెంట్ దశరథ్ కీ పూలమాల చాలువాతో సన్మానించడం జరిగింది.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కుటుంబ సభ్యులు, పత్రిక మిత్రులు పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు."

## పుల్కల్‌లో లిక్కర్ కంపెనీ ఎదుట మహిళా కార్మికుల నిరసన



సందేశం టైమ్స్, పుల్కల్, మే 1, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం ఎస్. ఇటిక్యాలలోని ఎంఎస్ లిక్కర్ కంపెనీ ఎదుట గురువారం మహిళా కార్మికులు నిరసనకు దిగారు. డ్యూటీకి వెళ్లే సమయంలో సూపర్‌వైజర్ తోపి రవి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపిస్తూ, కాంట్రాక్టర్ శ్రీనివాస్‌తో కలిసి అతనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమస్యకు పరిష్కారం వచ్చే వరకు విధులను బహిష్కరిస్తామని ప్రకటించిన మహిళా కార్మికులు కంపెనీ ఎదుట బైఠాయించి నిరసన కొనసాగించారు. ఈ ఘటనతో కంపెనీ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# విద్యాశాఖ వారోత్సవాలను ఉత్సవంలా నిర్వహించాలి: యోగిత రానా




సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 1, ప్రతినిధి: ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి 18 వరకు జరగనున్న విద్యాశాఖ వారోత్సవాలను పెద్ద ఉత్సవంలా నిర్వహించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగిత రానా అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆమె మాట్లాడుతూ వారోత్సవాలను గ్రామస్థాయిలో విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. రోజువారీ కార్యక్రమాలను ప్రణాళికబద్ధంగా చేపట్టి బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని, అందరూ సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.




## అదనపు కలెక్టర్ సీతారామరావు సేవలు మరువలేనివి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 1, ప్రతినిధి: ఒక అధికారిగా మాత్రమే కాకుండా ఒక మంచి మనిషిగా, పరిపాలనలో చురుకైన పాత్ర పోషిస్తూ అదనపు కలెక్టర్‌గా కె. సీతారామరావు అందించిన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కొనియాడారు. గురువారం జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామరావు పదవీ విరమణ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నిబద్ధతతో, కష్టకాలంలో కూడా సంయమనంతో సమస్యలను పరిష్కరించి ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయడంలో ఆయన చూపిన చొరవ అద్భుతమని, సహోద్యోగులకు, కింది స్థాయి సిబ్బందికి ఎప్పుడూ దిక్సూచిలా నిలిచారని, సామాన్య ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ త్వరితగతిన సమస్యలను పరిష్కరించే ఆయన పని తీరు జిల్లా పరిపాలనలో ప్రత్యేక ముద్ర వేసిందని ప్రశంసించారు, పదవీ విరమణ అనేది కేవలం బాధ్యతల నుంచి విరామమే అయినప్పటికీ అనుభవానికి, జ్ఞానానికి అది కొత్త నాంది అని పేర్కొంటూ సెకండ్ ఇన్నింగ్స్‌లో పూర్తి ఆరోగ్యంతో, మనశ్శాంతితో గడపాలని ఆకాంక్షించారు అలాగే ఇన్నాళ్లూ విధి నిర్వహణలో కుటుంబానికి కేటాయించలేకపోయిన సమయాన్ని ఇప్పుడు వారితో ఆనందంగా గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, ఆర్డీవోలు వేణు మాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో ఏడవ స్థానం సాధించిన సూర్యాపేట జిల్లా విద్యాశాఖకు కలెక్టర్ అభినందనలు

సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 1, ప్రతినిధి: గౌరవ జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ అధ్యక్షతన జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పదవ తరగతి ఫలితాలపై సమీక్ష సమావేశం నిర్వహించగా, ఈ ఏడాది సూర్యాపేట జిల్లా 98.6 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో ఏడవ స్థానంలో నిలిచినందుకు జిల్లా విద్యాశాఖను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అనుసరించిన కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేసిన మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులను ప్రశంసిస్తూ ప్రతి పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించాలని సూచించారు, అలాగే ఉదయం-సాయంత్రం ప్రత్యేక తరగతులు, ప్యానల్ ఇన్స్పెక్షన్ టీమ్స్, సమగ్ర మూల్యాంకనం, తక్కువ ఉత్తీర్ణత ఉన్న ఉపాధ్యాయులకు మెమోలు జారీ వంటి చర్యల వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు, వచ్చే విద్యా సంవత్సరానికి ముందే ఈ విజయాన్ని బడిబాట కార్యక్రమం, సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచిస్తూ క్షేత్రస్థాయి సమస్యలు ఉంటే సమగ్ర ప్రణాళికతో ముందుకు రావాలని, జిల్లా మరియు మండల స్థాయిలో మరింత ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు.

## మే 14 లోపు పీఎం ఇంటర్న్‌షిప్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి: మై భారత్ జిల్లా యువజన అధికారి రంజిత్ రెడ్డి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 1, ప్రతినిధి: దేశంలోని ప్రముఖ కంపెనీలలో చెల్లింపు ఆధారిత ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తూ యువతకు వాస్తవ వ్యాపార వాతావరణంలో అనుభవం పొందే అవకాశాన్ని ప్రధాని ఇంటర్న్‌షిప్ పథకం (PMIS) అందిస్తోందని మై భారత్ సంగారెడ్డి జిల్లా యువజన అధికారి ఎం. రంజిత్ రెడ్డి తెలిపారు. ఈ పథకం ద్వారా నైపుణ్యాభివృద్ధికి ప్రోత్సాహం లభించడంతో పాటు విద్యా అభ్యాసం మరియు పరిశ్రమ అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందని ఆయన పేర్కొన్నారు, ఈ పథకం కింద ప్రతి ఇంటర్న్‌కు నెలకు గరిష్ఠంగా రూ.9,000 స్టైపెండ్ అందుతుందని, ఇందులో రూ.900 సంస్థ చెల్లించగా రూ.8,100 కేంద్ర ప్రభుత్వం నేరుగా ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు, అదనంగా జీవిత బీమా, ప్రమాద బీమా సౌకర్యాలతో పాటు మొత్తం కాలానికి రూ.6,000 అదనంగా రెండు విడతలుగా జమ చేస్తారని చెప్పారు, ఇంటర్న్‌షిప్ వ్యవధి 6 నుంచి 9 నెలల వరకు ఉండగా విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికేట్ అందజేయబడుతుందని తెలిపారు, 18 నుండి 25 సంవత్సరాల వయస్సు కలిగి విద్య లేదా ఉద్యోగంలో లేని యువతతో పాటు 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు లేదా చదువుతున్న వారు అర్హులని పేర్కొంటూ ఆసక్తి గల అభ్యర్థులు మే 14, 2026 లోపు మై భారత్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు, మరిన్ని వివరాలకు 9650889829 లేదా mybharatsangareddy@gmail.com ద్వారా సంప్రదించాలని సూచించారు.

## టీడీపీ పొలిట్ బ్యూరోలో నక్కా ఆనందబాబు రీఎంట్రీ



సందేశం టైమ్స్, అమరావతి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం, మే 01, ప్రతినిధి: అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన పొలిట్ బ్యూరో సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు రెండోసారి పొలిట్ బ్యూరో సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు, ఈ కార్యక్రమం పార్టీకి కొత్త ఉత్సాహాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ ఉన్నత నాయకత్వంతో కలిసి కార్యక్రమంలో పాల్గొని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పొలిట్ బ్యూరో సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు, పార్టీ సంస్థాగత బలోపేతం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, ప్రజల ఆశయాల సాధన కోసం అందరూ ఐక్యంగా పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల ఆశయాలకు అనుగుణంగా సేవ చేయడం ద్వారా తెలుగుదేశం పార్టీని మరింత బలంగా నిలబెట్టాలని ఆయన ఆకాంక్షించారు, ఈ కార్యక్రమం టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేసిందని, నక్కా ఆనందబాబు నాయకత్వంలో శ్రేణులు మరింత ఉత్సాహంగా పార్టీ కార్యక్రమాల్లో ముందుకు సాగుతామని తెలిపారు.



## ఆందోల్ ను హెల్త్ హబ్ గా అభివృద్ధి చేస్తున్నాం మంత్రి దామోదర్ రాజనర్సింహ

సందేశం టైమ్స్, ఆందోల్, మే 1, ప్రతినిధి: ఆందోల్ మండలం డాకూర్ గ్రామంలో ధర్మశాస్త్ర ఫౌండేషన్-సహారా హాస్పిటల్, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంపును రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య రంగాన్ని బలోపేతం చేస్తోందని, క్యాన్సర్, డయాలసిస్, గుండె సంబంధిత వ్యాధులు, ఎన్‌సీడీ చికిత్సలను కార్పొరేట్ స్థాయిలో ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు వెన్ను, కీళ్ల నొప్పుల కోసం డాక్టర్ సూచనలు లేకుండా పెయిన్ కిల్లర్ మందులు వాడటం వల్ల కిడ్నీ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డాక్టర్ సూచనలు లేకుండా మందులు వాడకూడదని సూచిస్తూ, దగ్గర్లోని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రి, సంగారెడ్డి జిల్లా ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆందోల్‌ను హెల్త్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించిన మంత్రి, సహారా ఆసుపత్రి క్యాన్సర్ రోగులకు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త డా. ముప్పారం ప్రకాశం చికిత్స అనంతరం కోలుకోవడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ వైద్యులు, ఆశా వర్కర్ల సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వసంత్ కుమార్, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐపీఎల్ 2026లో టాప్ ప్లేయర్లు, జట్ల స్థితి వెల్లడైన తాజా గణాంకాలు

| | Team | M | W | L | NRR | Pts |
|---|---|---|---|---|---|---|
| 1 | PBKS | 8 | 6 | 1 | +1.043 | 13 |
| 2 | RCB | 8 | 6 | 2 | +1.919 | 12 |
| 3 | SRH | 9 | 6 | 3 | +0.832 | 12 |
| 4 | RR | 9 | 6 | 3 | +0.617 | 12 |
| 5 | GT | 8 | 4 | 4 | -0.475 | 8 |
| 6 | CSK | 8 | 3 | 5 | -0.121 | 6 |
| 7 | DC | 8 | 3 | 5 | -1.060 | 6 |
| 8 | KKR | 8 | 2 | 5 | -0.751 | 5 |
| 9 | MI | 8 | 2 | 6 | -0.784 | 4 |
| 10 | LSG | 8 | 2 | 6 | -1.106 | 4 |

సందేశం టైమ్స్, క్రీడా విభాగం, మే 1, ప్రతినిధి: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో తాజా గణాంకాలు విడుదల కాగా బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో టాప్ ఆటగాళ్ల ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. బ్యాటింగ్‌లో ఎ. శర్మ 425 పరుగులతో అగ్రస్థానంలో ఉండగా హె. క్లాసెన్ 414 పరుగులు, వి. సూర్యవంశీ 400 పరుగులతో తరువాతి స్థానాల్లో నిలిచారు, అలాగే ఎల్. రాహుల్, వి. కోహ్లీ వంటి ఆటగాళ్లు కూడా స్థిరమైన ప్రదర్శన కనబరుస్తున్నారు. బౌలింగ్ విభాగంలో ఎం. ఖాన్ అత్యుత్తమంగా 15 వికెట్లు తీసి ముందంజలో ఉండగా బి. కుమార్, జే. ఆర్చర్, రబాడా వంటి బౌలర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. అత్యధిక వ్యక్తిగత స్కోర్లలో రాహుల్ 152 పరుగులతో టాప్‌లో ఉండగా, అగ్ర బౌలింగ్ ఫిగర్స్‌లో ఎం. ఖాన్ 5/23తో మెరుగైన ప్రదర్శన నమోదు చేశారు. జట్ల పట్టికలో పంజాబ్ కింగ్స్ 13 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా ఆర్సీబీ, సన్‌రైజర్స్, రాజస్థాన్ రాయల్స్ 12 పాయింట్లతో పోటీలో ఉన్నాయి, చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ వంటి జట్లు మధ్యస్థానంలో కొనసాగుతుండగా ప్లేఆఫ్ రేసు మరింత ఉత్కంఠభరితంగా మారింది.

## RTE యాక్ట్ అమలుపై మీడియా-కార్పొరేట్ విద్యాసంస్థలపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపణలు




సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 01, ప్రతినిధి: పత్రికలు మరియు కార్పొరేట్ విద్యాసంస్థలు కలిసి ప్రజలను మోసం చేస్తున్నాయని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపించారు, రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ (RTE-2009) అమలు జరగకుండా కొన్ని మీడియా సంస్థలు, కార్పొరేట్ స్కూళ్లు కుట్రలు చేస్తున్నాయని ఆయన విమర్శించారు. కోట్ల రూపాయల ప్రకటనల (అడ్వర్టైజ్మెంట్స్) కోసం పేద మధ్యతరగతి ప్రజలకు రావాల్సిన ఉచిత విద్య హక్కును అడ్డుకుంటున్నారని పేర్కొంటూ, ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్న బడ్జెట్ ప్రైవేట్ స్కూళ్లు కూడా RTE అమలు కోసం డిమాండ్ చేయాలని పిలుపునిచ్చిన ఆయన, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలంటే చట్టబద్ధంగా ప్రజలు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. పత్రికల్లో వచ్చే ప్రకటనలు, యాడ్స్ చూసి మోసపోవద్దని, అవి వ్యాపార ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగపడుతున్నాయని ఆయన హెచ్చరించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.